క్లుప్తంగా

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను తొలగించాలి



ములుగు రూరల్: మల్లంపల్లిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ చాతళ్ల రమేశ్, నెమలి నర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ టీఎస్ దివాకరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థులు చితకబాదిన సంఘటనలో ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే దాడి జరిగిందన్నారు. తక్షణమే విధులకు గైర్హాజరైన వారిని సస్పెండ్ చేయాలని, దాడికి పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, చంద్రమౌళి, రాజేష్, శ్యాం, రవిందర్, మురళి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

వెంకటాపురం(కె): వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 2005–26 సంవత్సరానికి గాను సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం పలు రకాల పనిముట్లు అందజేస్తుందని మండల వ్యవసాయ అధికారి నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళా, చిన్నకారు, సన్నకారు మహిళా రైతులకు అవకాశం ఉందన్నారు. ఐదు ఎకరాల లోపు ఉన్న వారికి 50 శాతం, ఐదు ఎకరాలపైకి ఉన్న వారికి 40 శాతం సబ్సిడి అందించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, కుల ధ్రువీకరణ పత్రం, ట్రాక్టర్‌కు సంబంధించిన పరికారాలైతే ఆర్‌సీని ఏఈఓలకు అందజేయాలన్నారు. ఈ పథకం ద్వారా బ్యాటరీ స్ప్రేయర్స్, రోటవేటర్స్, కల్టివేటర్స్, బ్రష్ కట్టర్ కేటాయించినట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన ఈఓ

మంగపేట: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి(ఈఓ) రేవెల్లి మహేశ్ మంత్రి సీతక్కను జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఆలయ సిబ్బంది ఉన్నారు.

'దళితులను పట్టించుకోని మంత్రి సీతక్క'



మాట్లాడుతున్న అంబాల మురళి

గోవిందరావుపేట: మంత్రి సీతక్క దళితులను పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కమిటీ సభ్యుడు మురళి అన్నారు. పస్రాలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి పస్రా గ్రామానికి వచ్చిన మంత్రి సీతక్కకు సీపీఎం ఆధ్వర్యంలో దళితులు వినతిపత్రాన్ని ఇస్తే పట్టించుకోకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయిందన్నారు. వినతిపత్రం ఇస్తే తిరిగి తమ ముఖంపై విసిరి వేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జెమిని, కవిత, స్వరూప, మమత, పుష్ప, ఆత్కూరు సమ్మక్క, భాగ్య, నాగెల్లి లాలమ్మ, సంతోష, చెంచు రాజమ్మ, చంద్రకళ, సుధాకర్, మంజుల, సమ్మక్క, కల్పన, బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అస్వస్థత

వాజేడు: మండల కేంద్రంలోని జంగాలపల్లి లోని కేజీబీవీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని రమ్యారెడ్డి శుక్రవారం అస్వస్థతకు గురైంది. కళ్లు తిరిగి కిందపడి పోవడంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం చేయించారు. మరో ఇంజక్షన్ అవసరం కావడంతో ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతానికి విద్యార్థిని ఆరోగ్యం నిలకడగనే ఉంది. ఈ విషయంపై కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సుజాతను ‹సాక్షి› వివరణ అడుగగా అస్వస్థతకు గురైన మాట నిజమే కాని కళాశాలలో వినాయక పూజలు చేస్తున్న క్రమంలో ఆ విద్యార్థిని అల్పాహారం చేయకపోవడంతో ఇలా జరిగిదని ప్రస్తుతం బాగానే ఉందని తెలిపారు.

ఎరుకల ఆత్మగౌరవ జెండా ఎగరాలి

గోవిందరావుపేట: ఈ నెల 31న ప్రతీ ఎరుకల వాడలో ఎరుకల ఆత్మగౌరవ జెండా ఎగరాలని ఆల్ ఇండియా ఎరుకల ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కో కన్వీనర్ కూరాకుల సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలో ఎరుకల సంఘం మండల కమిటీ అధ్యక్షుడు కూరాకుల సారయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా సమ్మయ్య హాజరై మాట్లాడారు. ఎరుకలు, చెంచులు, యానాధుల జాతుల బతుకలను ఛిద్రం చేసిన చట్టం క్రిమినల్ ట్రైబ్ యాక్ట్‌ని బ్రిటిష్ ప్రభుత్వంలో ప్రవేశ పెట్టారని అన్నారు. అలాంటి చట్టం ద్వారా ఎరుకల కులస్తులు ఎన్నో అవమానాలను పడ్డారని అన్నారు. ఎన్నో పోరాటాలు చేస్తే 1952 ఆగస్టు 31న యాక్ట్‌లను రద్దు చేశారని తెలిపారు. ఎరుకల మండల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వాజేడు: వరదను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు



వెంకటాపురం(కె): గోదావరి పాయలోకి చేరిన వరదనీరు



పెరుగుతున్న గోదావరి

- నీట మునిగిన రహదారులు
- నిలిచిన రాకపోకలు

వాజేడు: ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో గోదావరి ఉధృతంగా పెరుగుతుంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో గోదావరి వరద క్రమేపీ పెరుగుతూ శుక్రవారం సాయంత్రానికి 16.640 మీటర్లకు చేరుకుంది. దీంతో మండలంలో పలు చోట్ల రహదారులు ముంపునకు గురికావడంతో పాటు పలు గ్రామాలకు రాక పోకలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని పేరూరు, కృష్ణాపురం గ్రామాల మధ్యన మోడీ కుంట వాగు ద్వారా రహదారిపైకి వరద నీరు చేరడంతో కృష్ణాపురం, కడేకల్, పద్ద గంగారం, చంద్రుపట్ల, టేకుల గూడెం, టేకులగూడెం కాలనీ గ్రామాలకు పేరూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాల ప్రజలు పేరూరుకు రావాలంటే జాతీయ రహదారిపై నుంచి చుట్టూ తిరిగి రావాల్సి వస్తుంది. అదే విధంగా మండల కేంద్రం సమీపంలో కొంగాల వాగు ద్వారా వచ్చిన గోదావరి రహదారిని ముంచింది. దీంతో వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. కొంగాలవాగు అవతల ఉన్న సుమారు 25 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే జగన్నాథపురం మీదుగా రావాల్సి ఉంది. మండల పరిధిలోని పూసూరు, ఏడ్జర్లపల్లి గ్రామాల మధ్య ఉన్న వంతెనపైకి వరద నీరు చేరడంతో ఇక్కడ కూడా రాకపోకలు సాగడం లేదు. ఏడ్జర్లపల్లి, బొమ్మనపల్లి, ముత్తారం, కొత్తూరు గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వెంకటాపురం(కె) మీదుగా వాజేడుకు రావాల్సిన పరిస్థితి. కోయ వీరాపురం గ్రామ సమీపంలో చాకలివాగు వద్ద గోదావరి రహదారిపైకి చేరడంతో గ్రామస్తులు చీకుపల్లి మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది.



వాజేడు: పూసూరు, ఎడ్జర్లపల్లి మధ్య నీట మునిగిన రహదారి వద్ద అడ్డుగా పెట్టిన ట్రాక్టర్

అప్రమత్తమైన అధికారులు

గోదావరి వరద ఇంకా పెరుగుతుండడంతో పాటు పలు చోట్ల రహదారులను ముంచెత్తడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, వాజేడు, పేరూరు ఎస్సైలు జక్కుల సతీశ్, కృష్ణ ప్రసాద్ వరద పరిస్థితిని పరిశీలించారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని ఎక్కడికక్కడ అప్రమత్తం చేయడంతో పాటు రహదారులపైకి వరద నీరు చేరడంతో నీటిలోకి ఎవరు వెళ్లకుండా ట్రాక్టర్లు అడ్డంగా పెట్టడమే కాకుండా కర్రలతో అడ్డుగా కట్టారు. ప్రజలకు ఎలాంటి అవసరం ఉన్నా వెంటనే సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.



వాజేడు: రహదారి పైకి చేరిన వరదను పరిశీలిస్తున్న ఎస్సై సతీశ్

వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె): మండలంలో గోదావరి వరద పెరుగుతుంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు గోదావరిలోకి చేరడంతో పాటు ఎగువ ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టులలో నీరు నిండడంతో వరద నీరును గేట్లు లేపి కిందకు వదులుతున్నారు. దీంతో మండలంలో క్రమంగా గోదావరి వదర పెరుగుతుంది. కాగా మండల కేంద్రంలోని గోదావరి లంకల్లోకి వెళ్లే గోదావరి పాయలోకి వరద నీరు రావడంతో గోదావరి లంకల్లోకి రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు గోదావరి లంకల్లోకి వ్యవసాయ పనులకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది.

వేడి ఆహారం తీసుకోవాలి

- డాక్టర్ ప్రణీత్‌కుమార్

ఏటూరునాగారం: వర్షకాలంలో ప్రజలు వేడి వేడి ఆహారం తీసుకోవాలని కొండాయి వైద్య అధికారి ప్రణీత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని దొడ్ల, కొత్తూరు గొత్తికోయగూడెంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొత్తికోయగూడెంలో ఇంటింటా జ్వరం సర్వే చేపట్టినట్లు తెలిపారు. 32 మందికి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులు ఇచ్చామన్నారు. దోమ తెరలను విధిగా వినియోగించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఫ్రైడే డ్రైడే నిర్వహించి నిల్వ ఉన్న నీటిని తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సమ్మక్క, ఆశ కార్యకర్త సునిత పాల్గొన్నారు.



కొత్తూరులో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రణీత్‌కుమార్

బహిరంగ సభను జయప్రదం చేయాలి

వెంకటాపురం(ఎం): సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించే మహాగర్జన యుద్ధభేరి బహిరంగసభకు దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు కాడపాక శ్యామ్, మరాతి రవీందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లెలో చేయూత పెన్షనర్లతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాతల రమేశ్, నెమలి నర్సయ్య, కల్లెపెల్లి రమేశ్, రాజనర్సయ్య, సాంబయ్య, సంధ్య, మమత, సునీత, అనిత, రజిత తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులతో మాట్లాడుతున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

వాజేడు: మండలంలో స్థానికంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు పెద్ది జగపతిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జగపతి బాబు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు లేకపోవడంతో మండలంలోని అన్ని పంచాయతీల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు 420 హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ మండల అధ్యక్షుడు రామ్ కిషోర్, సాగి సీతారామ రాజు, కుర్సం కృష్ణమూర్తి, యాలం సుబ్బయ్య, సంద్ర సోమరాజు తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మత్తు పదార్థాలను వీడాలి

- యాంటీనార్కోటిక్ డీఎస్పీ రమేశ్
- డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు

ఏటూరునాగారం: మత్తు పదార్థాలను వీడాలని, మత్తులో ఉన్నా కూడా నేరమేనని జిల్లా యాంటీ నార్కోటిక్ డీఎస్పీ రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటి డ్రగ్ సెల్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల వైపు వెళ్లకూడదని, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం నార్కోటిక్ సీఐ శ్రీకాంత్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడకం, అమ్మకం, వారికి ఆశ్రయం ఇవ్వడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేణుక, అధ్యాపకులు వెంకటయ్య, నవీన్, జ్యోతి, ఫాతిమా, సంపత్, రమేశ్, భాస్కర్, జీవవేణి, శేకర్, భారతి, భావన, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రమేశ్

ఓటర్ల జాబితా ప్రదర్శన

ఏటూరునాగారం: పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ రూపొందించిన వార్డులు, గ్రామ పంచాయతీల వారీగా నమోదు అయిన ఓటర్ల జాబితాను డ్రాఫ్ట్ రూల్స్ కాపీలను గ్రామ పంచాయతీల వారీగా శుక్రవారం విడుదల చేశారు. గ్రామ పంచాయతీలోని వార్డులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీల నాయకుల సమక్షంలో అధికారులు ఓటర్ల జాబితాను విడుదల చేసి గ్రామ పంచాయతీ నోటిసు బోర్డులపై అతికించారు. ఈ వార్డుల వారీగా ఉన్న ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈనెల 31 వరకు అభ్యంతరాలు సమర్పించాలని అధికారులు కోరారు. అభ్యంతరాలను పరిష్కరించి సెప్టెంబర్ 2న ఓటర్ల తుది జాబితాను అధికారులు విడుదల చేయనున్నారు. మండలంలో 12 గ్రామ పంచాయతీలు, 114 వార్డులు, 129 పోలింగ్ స్టేషన్లు, 24635 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 11862, స్త్రీలు 12767, ఇతరులు ఆరుగురు ఉన్నారు.



ఓటర్ల జాబితాను చూపిస్తున్న అధికారులు, నాయకులు

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

మంగపేట: మండలంలోని కమలాపురం, పొదుమూరు, నర్సింహాసాగర్ గ్రామాలకు చెందిన వరద బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకుల కిట్లను శుక్రవారం రాత్రి పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కమలాపురంలో ఎర్రవాగు పొంగి ప్రవహించడంతో జనావాసాల్లోకి వరదనీరు చేరడంతో పాటు ఇళ్ల గోడలు కూలి పాక్షికంగా ధ్వంసం అయిన విషయం తెలిసిందే. దీంతో మంత్రి ఆదేశాల మేరకు రిలేయబుల్ ట్రస్ట్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కమలాపురం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బాధితులకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ భానోతు రవిచందర్, అదనపు కలెక్టర్ చీమలపాటి మహేందర్‌జీతో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఇర్సవడ్ల వెంకన్న, గుమ్మడి సోమయ్య, మైల జయరాంరెడ్డి, యానమయ్య పాల్గొన్నారు.



సరుకులు అందిస్తున్న రవిచందర్, మహేందర్‌జీ

జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవం




ఏటూరునాగారం: ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూల మాల వేస్తున్న అధ్యాపకులు




ఎస్ఎస్ తాడ్వాయిలో..

ములుగు రూరల్/ఏటూరునాగారం/ఎస్ఎస్ తాడ్వాయి/వాజేడు: పలు మండలాల్లోని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో శుక్రవారం ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి జయంతిల సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. వారి చిత్రపటాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి వారు చేసిన సేవలను కొనియాడారు.



బండారుపల్లి మోడల్ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ దేవకి



వాజేడులో..

గణపయ్యకు భక్తుల పూజలు



ఏటూరునాగారం: పూజలు చేస్తున్న భక్తులు



ములుగు రూరల్: అన్నం వడ్డిస్తున్న అశోక్



ఏటూరునాగారం: రామాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడో రోజు శుక్రవారం లక్ష్మీగణపతి కుంకుమ అర్చన పూజా కార్యక్రమాలను అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్ రావుశర్మ నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం దుర్గాదేవి అమ్మవారికి లలితాసహస్రనామాలతో అర్చనలు చేశారు. అదేవిధంగా బొడ్రాయి వినాయకుడి మండపం వద్ద అర్చకుడు రాధాకృష్ణ శర్మ మహిళలతో కుంకుమ అర్చన పూజలు చేయించారు. ఓడవాడలో భారత్‌యూత్ ఆధ్వర్యంలో గణపతి మండపం వద్ద విద్యార్థులకు యూత్ సభ్యులు శరత్, భరత్, నర్సింహరావు, అర్చకులు నోటుబుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఓడవాడలోని గణపతి మండలం వద్ద రాత్రి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ములుగు రూరల్: అన్ని దానాలలో అన్నదానం గొప్పదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాస్ ఫొటో స్టూడియో అధినేత మాట్ల అనూష-భద్రి దంపతులు అన్నదానం కార్యక్రమం చేపట్టగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు వినాయక్, వెంకటేష్, శ్రావణ్, కిషోర్, రంజిత్, రాహుల్, ప్రదీప్, సందీప్, వంశీ, జశ్వంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం: నోటు బుక్స్ పంపిణీ చేస్తున్న అర్చకుడు రాధాకృష్ణశర్మ

నూతన కమిటీ ఎన్నిక



నియామక పత్రం అందుకుంటున్న కమిటీ సభ్యులు

మంగపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ యువజన సంఘం నూతన మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగ్గిళ్ల సురేష్, ప్రధాన కార్యదర్శిగా జానపట్ల జయరాజు, ఉపాధ్యక్షులుగా గాదె శ్రీనివాసాచారి, హైదర్ బుట్టో, పూనెం రాములు, పూజల నర్సింహారావు, సారయ్య, కార్యదర్శులుగా దూలగొండ సాంబశివ రావు, గోనె నాగేష్, కళాల రాంబాబు, కొమరం రవికుమార్, జాడి రాంబాబు, కోశాధికారిగా యాసం హరీష్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి దీగొండ కాంతారావు, జిల్లా అధ్యక్షుడు నక్క భిక్షపతి, డివిజన్ కన్వీనర్ గుండాల రఘు, జనగాం రవి, కర్రి శ్యాంబాబు, చంద్రయ్య పాల్గొన్నారు. అనంతరం ఎస్సై టీవీఆర్ సూరిని నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి పరిచయం చేసుకున్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి



ఎస్ఎస్ తాడ్వాయి: లక్ష్మిని సన్మానిస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ కల్యాణి



వెంకటాపురం(ఎం): ఇస్మాయిల్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

వెంకటాపురం(ఎం)/ ఎస్ఎస్‌తాడ్వాయి/వెంకటాపురం(కె): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి పలువురు అన్నారు. వెంకటాపురం(ఎం)లోని తహసీల్దార్ కార్యాలయంలోని అటెండర్ ఇస్మాయిల్, ఎస్ఎస్‌తాడ్వాయిలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వార్డెన్ మోకాళ్ల లక్ష్మి, వెంకటాపురం(కె)లో పని చేస్తున్న డీపీఎంఓ సత్యనారాయణ పదవీ విరమణ పొందారు. దీంతో ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సన్మాన సభలో వారిని ఘనంగా సన్మానించి వారు చేసిన సేవలను కొనియాడారు. వారి శేషజీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.



వెంకటాపురం(కె): సత్యనారాయణను సన్మానిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు

వరద ఉధృతి పరిశీలన

మంగపేట: మండల కేంద్రంలోని బోరునర్సాపురం బ్రిడ్జి వద్ద గోదావరి వరద ఉధృతిని తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ భద్రునాయక్ శుక్రవారం పరిశీలించారు. గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తున్నందున గోదావరిలోకి ఎవరుకూడా చేపల వేటకు వెళ్లొద్దని, ప్రజలు అప్రమతగా ఉండాలని హెచ్చరించారు. ముంపు ప్రాంతాలయిన పొదుమూరు, దేవనగరం, కత్తిగూడెం, అకినేపల్లి మల్లారం లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాని ఆయా పంచాయతీల కార్యదర్శులను ఆదేశించారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేశ్

ములుగు రూరల్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన నగరపు రమేశ్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో రమేశ్‌కు నియమకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసిన వారికి పదవులు వరిస్తాయని అన్నారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ.. తనకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండో సారి అవకాశం కల్పించినందుకు కృషి చేసిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.



రమేశ్‌కు నియామక పత్రం అందిస్తున్న బలరాం

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944